# బంకుల వద్ద బారులు

- నిలిచిన ట్యాంకర్ల రాకపోకలు
- పెట్రోల్ బంక్‌ల్లో గందరగోళ పరిస్థితి
- ఉదయం నుంచే బంక్‌ల వద్ద బారులు తీరిన వాహనదారులు
- కొన్ని బంక్‌ల్లో నోస్టాక్ బోర్డులు
- గంటల తరబడి రోడ్లపై ట్రాఫిక్ జామ్

ఇబ్రహీంపట్నం, జనవరి 2 : కేంద్ర ప్రభుత్వం విధించిన ఆంక్షలతో ట్యాంకర్ల యాజమానులు కొనసాగించిన సమ్మె వాహనదారులపై తీవ్ర ప్రభావం చూపింది. కేంద్రం ఇటీవల తీసుకువచ్చిన మోటర్‌వాహనాల చట్టసవరణ బిల్లును వ్యతిరేఖిస్తూ ట్యాంకర్ల యజమానులు సమ్మెకు దిగారు. దీంతో ట్యాంకర్ల రాకపోకలు నిలిచిపోవటంతో పెట్రోల్‌బంకుల్లో పెట్రోల్, డీజిల్ దొరుకని పరిస్థితి ఏర్పడింది. పెట్రోల్, డీజిల్ లేకపోవటంతో వాహనదారులు గంటలతరబడి పెట్రోల్ బంకుల వద్ద వేచిచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. అన్ని పెట్రోల్‌బంక్‌ల వద్ద నోస్టాక్ బోర్డులు దర్శనమిచ్చాయి. దీంతో జిల్లాలోని 436 పెట్రోల్ బంక్‌ల్లో డీజిల్, పెట్రోల్ కోసం పెద్ద ఎత్తున గందరగోళ పరిస్థితి ఏర్పడింది. కొన్ని బంకుల్లో ఉదయం నుంచే పెట్రోల్, డీజిల్ లేకపోవటంతో యజమానులు నోస్టాక్ బోర్డులు పెట్టారు. మరికొన్ని బంకుల్లో పెట్రోల్, డీజిల్ ఉన్నప్పటికీ మళ్లీ దొరుకదనే పరిస్థితిలో వాహనదారులు పెద్ద ఎత్తున అక్కడకు చేరుకున్నారు. దీంతో పెట్రోల్ బంకుల వద్ద వేలాది వాహనాలు క్యూకట్టాయి. మరోవైపు వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతుండటంతో ట్రాక్టర్లు కూడా పెట్రోల్‌బంక్‌ల వద్ద డీజిల్ కోసం క్యూకట్టాయి. పలు పెట్రోల్‌బంక్‌ల వద్ద వాహనాలు బారులు తీరటంతో పెద్ద ఎత్తున ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది. సాయంత్రానికి ట్యాంకర్ల యజమానులు సమ్మె విరమించటంతో రాత్రివరకు పెట్రోల్, డీజిల్ ట్యాంకర్లు బంక్‌లకు చేరుతాయని.. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని బంక్‌ల యజమానులు వాహనదారులకు సర్దిచెప్పారు. ముఖ్యంగా హైదరాబాద్–నాగార్జునసాగర్ రహదారిపై ఉన్న అనేక పెట్రోల్‌బంకుల్లో పెట్రోల్, డీజిల్ లేక మూతపడినాయి. ఈ రహదారిపై వెళ్లే వాహనాలు పెట్రోల్, డీజిల్ దొరుకక రోడ్లపైనే పడిగాపులు గాయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**కేంద్ర ప్రభుత్వ ఆంక్షలతో ట్యాంకర్ల యజమానుల సమ్మె**



తుర్కయాంజాల్ హెచ్‌పీ పెట్రోల్ బంకులో బారులు తీరిన వాహనదారులు




శంకర్‌పల్లిలో పెట్రోల్ లేక బంకు మూసివేసిన దృశ్యం

**తుర్కయాంజాల్‌లో..**

తుర్కయాంజాల్ : తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధి సాగర్ రహదారి మార్గంలో పూర్తిగా ట్రాఫిక్ స్తంభించింది. బుధవారం నుంచి పెట్రోల్, డీజిల్ అందుబాటులో ఉండదనే భయంతో వాహనదారులు బంకుల వద్ద క్యూ కట్టి పెట్రోల్, డీజిల్ నింపుకుంటున్నారు. దీంతో గంటలకొద్దీ ట్రాఫిక్ జామ్ ఏర్పడిందని స్థానికులు వాపోతున్నారు.

**పెరిగిన రద్దీ..**

పరిగి : పరిగి పట్టణంలోని పెట్రోల్ బంకుల్లో వాహనదారులు పెట్రోల్, డీజిల్ కోసం బారులు తీరారు. ఒక దశలో పెట్రోల్ బంకులోకి వాహనాలు రాకుండా తాళ్లు అడ్డుగా కట్టగా, పెద్ద డబ్బాలు తీసుకువచ్చి జనం బారులు తీరి పెట్రోల్, డీజిల్ పోయించుకున్నారు. తాము సమ్మె చేయడం లేదని ఆయిల్ ట్యాంకర్ల యూనియన్ వారు ప్రకటించిన తర్వాత సైతం పట్టణంలోని బంకుల్లో అదే రద్దీ కనిపించింది.

**వికారాబాద్ పట్టణంలో..**

వికారాబాద్ : వికారాబాద్ పట్టణంలోని పలు పెట్రోల్ బంకులతో పాటు ఎన్నెపల్లి వద్ద ఉన్న రెండు పెట్రోల్ బంకుల్లో వాహనదారులు బారులు తీరడంతో రద్దీ ఏర్పడింది.



పరిగిలోని ఓ పెట్రోల్ బంకు వద్ద వాహనాలు



ఇబ్రహీంపట్నం : పెట్రోల్ బంకుల వద్ద బారులు తీరిన వాహనదారులు



శంకర్‌పల్లిలోని ఓ పెట్రోల్ బంకు వద్ద వాహనాల రద్దీ

## ఉపకార వేతనాల దరఖాస్తుల గడువు పొడిగింపు



వికారాబాద్, జనవరి 2 : పోస్ట్‌మెట్రిక్ ఉపకార వేతనాల దరఖాస్తుల కొరకు గడువును పొడిగించినట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఎన్. మల్లేశం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికి గానూ జిల్లాలోని వివిధ ప్రైవేటు, ప్రభుత్వ కళాశాలల్లో వివిధ కోర్సుల్లో విద్యనభ్యసిస్తున్న అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులు (ఫ్రెష్, రెన్యువల్)కు గానూ పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు తేదీని జనవరి 31వరకు పొడిగించడం జరిగిందని ఆయన తెలిపారు. విద్యార్థుల ఉపకారవేతనాల నమోదు ప్రక్రియ పోస్ట్‌మెట్రిక్ (ఫ్రెష్, రెన్యువల్) కోసం ఈ–పాస్ వెబ్‌సైట్ http :// telanganaepass. cgg.gov.in నందు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. అదే విధంగా పెండింగ్‌లో ఉన్న 2022–23, 2023–24 విద్యా సంవత్సరముల పోస్ట్ మెట్రిక్ హార్డ్ కాపీలు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి వికారాబాద్ జిల్లా కార్యాలయంలో త్వరగా సమర్పించాలని తెలిపారు.

## ఒగ్గు కళాకారుడికి పద్మజ్యోతి అవార్డు

బొంరాస్‌పేట, జనవరి 2 : మండలంలోని నాందార్‌పూర్ గ్రామానికి చెందిన ఒగ్గు కళాకారుడు బీరప్పకు పద్మజ్యోతి అవార్డు లభించింది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో ఒగ్గు కళా ప్రదర్శనలు ఇచ్చినందుకు సంస్కృతీ కళానికేతన్ సంస్థ ఈ అవార్డులను ప్రకటించింది. సంస్థ మరియు రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో జరిగిన కార్యక్రమంలో బీరప్పకు ఈ అవార్డును రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యాదవ్, భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ ప్రదానం చేశారు. తనకు పద్మజ్యోతి అవార్డు లభించడం పట్ల బీరప్ప హర్షం వ్యక్తం చేశారు.




బీరప్పకు అవార్డును ప్రదానం చేస్తున్న అతిథులు

## 9, 10 తేదీల్లో జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్

**ఏర్పాట్లు చేస్తున్న విద్యాశాఖ**

**జిల్లా వ్యాప్తంగా 250 వరకు పాఠశాలలు పాల్గొనే అవకాశం!**

రంగారెడ్డి, జనవరి 2 (నమస్తే తెలంగాణ) : జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌కు రంగారెడ్డి జిల్లా ముస్తాబవుతున్నది. ఈనెల 9, 10 తేదీలలో రెండు రోజులపాటు నిర్వహించనున్నారు. ఇందుకు ఇబ్రహీంపట్నంలోని గురుకుల్ విద్యాపీఠ్ హైస్కూల్ వేదికగా నిలువనున్నది. సైన్స్‌ఫెయిర్‌కు సంబంధించిన ఏర్పాట్లలో జిల్లా విద్యాశాఖ నిమగ్నమైంది. జిల్లాలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత, ఉన్నత, కేజీబీవీ, మాడల్, రెసిడెన్షియల్, ప్రైవేట్ పాఠశాలలు ఈ సైన్స్ ఫెయిర్‌లో పాల్గొననున్నాయి. ఐదు అంశాలపై విద్యార్థులు తమ ప్రదర్శనలను ఆఫ్‌లైన్‌లో ప్రదర్శించనున్నారు. జూనియర్స్, సీనియర్స్ విభాగంలో 10 అత్యుత్తమ ప్రదర్శలను ఎంపిక చేసి రాష్ట్రస్థాయి ప్రదర్శనలకు పంపిస్తారు. జిల్లా వ్యాప్తంగా 200–250 పాఠశాలలు సైన్స్‌ఫెయిర్‌లో పాల్గొనే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. విద్యార్థులు సైన్స్ ఫెయిర్‌కు హాజరయ్యేలా చూడాలని జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు పాఠశాలల హెచ్‌ఎంలను కోరారు. ఇతర వివరాలకు జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసరావు, 9395390985ను సంప్రదించాల్సిందిగా సూచించారు.


## కమ్మేసిన పొగమంచు

**రాకపోకలకు ఇబ్బంది పడ్డ వాహనదారులు**



షాద్‌నగర్‌లో ఇంటిని కమ్మేసిన పొగమంచు

షాద్‌నగర్‌టౌన్, జనవరి 2: షాద్‌నగర్ పట్టణాన్ని మంగళవారం పొగమంచు కమ్మేసింది. ఎక్కడ చూసినా పొగమంచే ఉండడంతో రోడ్లు సైతం కనిపించలేదు. ఉదయం 8గంటల వరకు కూడా పొగమంచు కమ్మేసింది. పొగమంచులో వాహనదారులు సైతం రాకపోకలు సాగించడానికి ఇబ్బంది పడ్డారు. వాహనాలకు లైట్లు వేసుకుని తమ రాకపోకలు సాగించారు. మరికొందరు మాత్రం తమ వాహనాలను రోడ్డు పక్కన నిలుపుకొని మంచు తగ్గిన తర్వాత వెళ్లారు. చలిగాలులతో ఉదయం, సాయంత్రం సమయాల్లో ప్రజలు బయటకు రాకుండా ఇంటికే పరిమితమవుతున్నారు.



పొగమంచులో లైట్లు వేసుకుని రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు